తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో

ప్రత్యామ్నాయ కేంద్రాల ఏర్పాటు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు --జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ఉమ్మడి పశ్చిమగోదావరి బ్యూరో, అక్టోబర్ 04 ప్రభాతవార్త

పశ్చిమగోదావరి జిల్లాలో అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో కొన్ని మండలాల్లో దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో ప్రత్యామ్నాయంగా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల కారణంగా కొన్ని మండలాల్లోని ప్రస్తుత పోలింగ్ కేంద్రాల భవనాలు దెబ్బతినడంతో సంబంధిత రిటర్నింగ్ అధికారులు ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదిస్తూ నివేదికలు సమర్పించారని తెలిపారు. సంబంధిత అధికారుల ప్రతిపాదనలను, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.అత్తిలి మండలం: పోలింగ్ కేంద్రం సంబరు 31కు సంబంధించి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల దక్షిణ వైపు భవనంలోని నాలుగో గదిలో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.భీమవరం మండలం: పోలింగ్ కేంద్రాల సంబర్లు 73, 74, 75లకు ప్రత్యామ్నాయంగా తుందుర్రులోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయం, ఎంపీపీ ప్రాథమిక పాఠశాల పశ్చిమ వైపు భవనంలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.మొగల్తూరు మండలం: కాళీపట్నం వెస్ట్‌లోని రైతు భరోసా కేంద్రం సమావేశ మందిరం, స్వర్ణ గ్రామం, అంగన్వాడీ కేంద్రం, పెరుపాలెం దక్షిణ ప్రాంతంలోని స్వర్ణ గ్రామం, కేపీ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిప్పల్లవారితోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వివేకా ఇంగ్లీష్ మీడియం పాఠశాల తదితర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పెనుమంట్ర మండలం: పెనుమంట్ర విశాల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, తహసీల్దార్ కార్యాలయ హాలు, గ్రంథాలయ హాలు, వేలగలవారిపాలెం గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం తదితర ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.ఉండి మండలం: శ్రీ గాంధీ మెమోరియల్ పాఠశాల, వీఆర్వో భవనం, ఎంపీపీ ప్రధాన పాఠశాల కొండ్రుతుపేట, ఎంపీడీవో కార్యాలయంలోని ఎంఈఓ గది, ఉపాధి హామీ పథకం గదుల్లో ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.వీరవాసరం మండలం: వీరవాసరం ఎం.ఆర్.కె. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎల్ ఆకారపు భవనంలో, ఉత్తర పశ్చిమవైపునేల అంతస్తులోని నాలుగు గదుల్లో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారులు ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను

సమర్థవంతంగా నిర్వహించాలి

ఉమ్మడి పశ్చిమగోదావరి బ్యూరో, అక్టోబర్ 04 ప్రభాతవార్త



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం అమరావతి సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ , ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సామగ్రిని నిర్దేశించిన మార్గాల్లోనే తరలించాలని, సామగ్రి తరలింపు సమయంలో తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించిన

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం నవంబర్ 4 ప్రభాతవార్త ఉండి మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉండి మండలంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ, సిబ్బంది కేటాయింపు, రవాణా ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుందని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

రౌతు గూడెం వద్ద వరద లో చిక్కుకున్న కూలీలు

సంఘటనా స్థలం లో పోలవరం ఎమ్మెల్యే బాలరాజు

జంగారెడ్డిగూడెం /జీలుగుమిల్లి, ప్రభాత వార్త పొలం పనులు చేసుకునేసుమారు 20మంది వ్యవసాయకూలీలు జీలుగుమిల్లి మండలం రౌతు గూడెం వద్ద వరద నీటిలో చిక్కుకు పోయారు. వారిని రక్షించే కార్యక్రమం లోపోలవరం ఎమ్మెల్యే ఎమ్మెల్యే శ్రీ బాలరాజు జిల్లా అధికారులతో సుమారు రెండు గంటలనుండి సంప్రదింపులు జరుపుతున్నారు. జిల్లా కలెక్టర్ కే వెట్రి సెల్వి, ఎస్ పి కే ప్రతాప్ కిషోర్ తదితరులతో మాట్లాడారు. ఎం డి అర్ దళాలు కోసం ఆయన ప్రభుత్వ అధికారులు తో మాట్లాడు తున్నట్టు సమాచారం.జాతీయ రహదారి గాఅప్ గ్రేడ్ అవుతున్న మెయిన్ రోడ్డు లోనే ఈ సంఘటన చోటు చేసుకుంది. రౌతు గూడెం గ్రామానికి సమీపం లో వంతెన దిగువన కూలీలు ఉండి పోయారు. వంతెన పక్కన గల డౌన్ లో రోడ్డు కొట్టుకు పోయినందున వారు వంతెన ఎక్కి తమ గ్రామం లోకి వెళ్లే పరిస్థితి లేదు. బుట్టాయి గూడెం వైపు వీరన్న గూడెం వద్ద కూడా నిర్మాణం లో వున్న వంతెన సెంట్రింగ్ కూలి పోయింది. ఆ మార్గం లో అనేక వాగులు ఉధ్ర తంగా ప్రవహిస్తున్న పరిస్థితి. కానుక వాగు ప్రవాహం వేగం తగ్గే వరకూ బాధితులకు మరో దారి లేదని అంటున్నారు. లేదా ఏదైనా సహాయక బృందం రావాలి. ప్రస్తుతం ఎమ్మెల్యే బాలరాజు అక్కడే స్థానికులతో పాటు వున్నారు.

పోలింగ్ సిబ్బందికి సుద్ద వాగు బ్రేక్

వరద నీరు పొంగు తున్న నేపథ్యంలో నిలిచి పోయిన వాహనం.

మూడు మండలాల్లో పోలింగ్ ఒక రోజు వాయిదా..

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త ఏజెన్సీ ప్రాంతం లో ఎన్నికలవిధుల్లో పాల్గొనేందుకు బయలు దేరి వెళుతున్న బృందానికి జంగారెడ్డిగూడెం శివారు సుద్ద వాగు బ్రేక్ వేసింది. అసలే అటవీ ప్రాంతం లో డ్యూటీ పడిందనే భయంతో బయలు దేరిన ఉద్యోగులు ఈ సంఘ టన తో మరింతగా బేజారేత్తి పోయినట్టు తెలిపారు. గురువారం సాయంత్రం ఎన్నికలకు అవసరమైన పోలింగ్ సరంజామా అధికారులనుంచి తీసుకుని తమ డ్యూటీ ప్రాంతాలకు అర్ టి సి బస్సులో బయలుదేరారు. తీరా రెండు కిలోమీటర్లు కూడా ప్రయాణం జరగకుండానే వారికీ సుద్ద వాగుకు వరద పోటు బ్రేక్ పడింది. వారు దాంతో ముందుకు వెళ్లే దారి లేక వెనక్కు వచ్చే సాహసం చెయ్యలేక మీడియా వద్ద తమ ఇబ్బంది ఏకరువు పెట్టు కున్నారు.

ఆరో తేదీకి ఏజెన్సీ పోలింగ్ మార్పు

ఎన్నికల విధుల్లో వారికి తీపి కబురో మరోటో తెలీదు గాని రేపు వారు విధులు నిర్వహించడం లేదు. ప్రస్తుతం వరద వాతావరణం నేపథ్యంలో గిరిజన ప్రాంతాలైనకుంకునూరు, వేలేరుపాడు బుట్టాయి గూడెం మండలాల్లో పోలింగ్ ఒక రోజు వాయిదా వేశారు. ఆరో తేదీ పోలింగ్ యధా విధిగా జరుగుతుందని అధికారులు తెలిపారు. దీనితో ఎన్నికలడ్యూటీ వీరికి మరో రోజు పెరిగింది.

భీమవరం పట్టణంలో

పలు ప్రాంతాలు జలమయం

జన జీవనం అస్తవ్యస్తం

భీమవరం టౌన్, నవంబర్ 4 : ప్రభాతవార్త

మూడు రోజులుగా తుఫాను వల్ల కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతల మైంది. అర్నాబ్ తుఫానుతో గాలులవల్ల తీవ్ర నష్టం జరిగితే మురసా తుఫానులో కుండపోత వర్షాల వల్ల పంటచేలు మునిగి పోవడమేకాక పల్లపు ప్రాంతాలు నివాసగృహాలతో సహా ముంపునకు గురయ్యాయి. వీధుల్లో అడుగు నుంచి రెండు అడుగుల ఎత్తువరకు నీరు నిలిచిపోయి, అదే స్థాయిలో పల్లపు ప్రాంతాల్లోని గృహాల్లో సైతం నీరు నిలువగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీధుల్లో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాల ఇంజన్లలోకి నీరు వెళ్లి అక్కడి కక్కడే ఆగిపోతున్నాయి. వాహనాలను అక్కడే వదిలేసి నీటిలో నడిచి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఆటో లు, కార్లు సైతం నీటిలో వెళ్లలేని పరిస్థితి నెల కొంది. నిరంతరంగా కురుస్తున్న వర్షాలతో ప్రజ లు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రూట్లలో బస్సులు కూడా వెళ్లలేని పరిస్థితి. బస్టాండ్ సైతం జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. వరుస తుఫాన్లు తీవ్ర నష్టం కలిగించగా, మరో తుఫాను పొంచి ఉందంటూ వినవస్తుండగా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు నేడు జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటు వినియోగించు కునేందుకు దూర ప్రాంతాల నుండి ఓటర్లు వచ్చేందుకు రవాణా సాధనాలు అందుబాటు లో లేకపోవడం, పలు రైళ్లు, బస్సులు రద్దుకావ టంతో ఓటర్లు, పోటీలో ఉన్న అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఏదేమైనా ఈ దఫా తుఫాన్ లు తీవ్ర నష్టాన్ని మిగిల్చి జనజీవ నంపై, తీవ్ర ప్రభావం చూపటమే కాక కోత కొచ్చిన పంటలు సైతం నీటమనిగి ఏడాది పాటు ఆహార కొరతను మిగిల్చింది.

పేదల డాక్టర్ ఇకలేరు

కన్నీరు మున్నీరైన అభిమానులు



పాలకొల్లు ప్రభాతవార్త వైద్యరత్నగా పేదల డాక్టర్ గా సేవే పరమావధిగా భావించిన వ్యక్తి మహా మనిషి డాక్టర్ సత్యనారాయణ మూర్తి బాబ్జి కన్నుమూశారు. ఆయన శాసనసభ్యునిగా చేసినా ప్రజల హృదయాల్లో ఎక్కువగా వైద్యుని గానే నిలిచిపోయారు. ప్రాణాంతక వ్యాధులకు ప్రాణం మీదకు వచ్చిందని సరికి డాక్టర్ బాబ్జి దేవుడిలా ఆదుకునే వారిని నేను మళ్ళీ బ్రతికాను అంటే అది ఆయన పెట్టిన బిక్ష అని వేల మంది చెబుతారు. వైద్య రంగంలో లైన్స్ క్లబ్ రోటరీ సేవా సంస్థల ద్వారా ఆయన అందించిన సేవలే కాకుండా గోదావరి జిల్లాల్లో అనేక క్లబ్బులను నెలకొల్పి వాటిలో నిష్ణాతులను ఉంచి వారి ద్వారా ప్రజలకు సేవలు అందించిన సేవా మార్గదర్శకుడు డాక్టర్ బాబ్జి. ఆయన లేని లోటు వైద్య రంగానికి తీరనిదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పాలకొల్లు నరసాపురం నాయకులు లైన్స్ క్లబ్ రోటరీ నిర్వాహకులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు

గ్రామాలలో మౌలిక వసతులు

అన్నీ కల్పిస్తాం : మంత్రి పార్థసారథి

చాట్రాయి,నవంబరు4, ప్రభాతవార్త గ్రామాలలో మౌలిక వసతులు అన్నీ కల్పించి ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగపడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పోతనపల్లి గ్రామంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు కార్యకర్తలతో చిన్న తండా గ్రామంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న తండా చిరకాల కోరిక అయిన త్రాగునీటి బోరు, మినరల్ వాటర్ ప్లాంట్ ఎన్నికల కోడ్ పూర్తికాగానే తండాకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పన చర్యలు చేపడతామని చెప్పారు. ఎంతో కాలంగా ఇబ్బంది పడుతున్న రోడ్డును త్వరలో నిర్మిస్తానని, ఇళ్ల స్థలాల సమస్య, సీసీ రోడ్లు మరియు డ్రైనేజీ, లైట్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఇప్పటికే తండాలో సుమారు 2 కోట్లతో సీసీ రోడ్డు నిర్మించామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. నాటి వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం అభివృద్ధిని మరిచి కేవలం డబ్బు పంచడానికే ప్రాముఖ్యత ఇచ్చిందని అన్నారు. కానీ అనుభవం గల, దూరదృష్టి గల, విజన్ ఉన్న నాయకుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో మన రాష్ట్రంలో సుమారు 20 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడంతో అనేక పరిశ్రమలు స్థాపించాయని, తద్వారా నిరుద్యోగులకు సుమారు 8 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి పేర్కొన్నారు.20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఉన్నత విద్యను అందిస్తున్నామని చెప్పారు. కుటుంబంలో చదువుకుంటున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం రూ.15 వేలు అందిస్తున్నామని అన్నారు. అంతేకాక నూజివీడు నియోజకవర్గంలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా మొదటి బహుమతి 25వేలు, రెండో బహుమతి 20వేలు, తృతీయ బహుమతి 10 వేలు అందించి నా వంతు సహాయ సహకారాలు చేశానని పేర్కొన్నారు.నా మీద నమ్మకంతో నన్ను గెలిపించి మంత్రిని చేసినందుకు మీ రుణం తీర్చుకోవడానికి నా వంతు సహాయ సహకారాలు ప్రభుత్వం నుండి మరియు నా ప్రత్యేక నగదు ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు.పోటీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం చేస్తున్న పథకాలన్నీ ప్రజలకు తెలియజేసి ప్రజల మన్ననలు పొందాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు.తండాలు, కాలనీలు, దళితవాడలు అభివృద్ధి చెందాలంటే కూటమి పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రివర్యులు కోరారు.ఈ కార్యక్రమంలో చాట్రాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదో తేదీన చైర్మన్

ప్రమాణ స్వీకారం

నరసాపురం ప్రభాత వార్త

నర్సాపురం మున్సిపల్ చైర్మన్గా భారీ మెజారిటీతో గెలిచిన కొత్తపల్లి శైలజ ఈ నెల 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను ప్రాయార్థి పరంగా చూసి పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా కొన్ని కీలకమైన రోడ్లు భారీగా దెబ్బతిన్నాయని వాటిని మరమ్మత్తు చేస్తామన్నారు.

మురసు తుపాను ప్రభావంతో రహదారిపై కూలిన మర్రిచెట్టు. స్పందించిన ఎస్ఐ జయ బాబు

టి.నరసాపురం నవంబర్ 4 ప్రభాతవార్త మురసు తుపాను ప్రభావంతో టి. నరసాపురం మండలంలో వీచిన ఈదురుగాలులకు ఏపు గుంట గ్రామ సమీపంలో భారీ మర్రి చెట్టు రహదారిపై కూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ఈ విషయాన్ని గుర్తించిన టి. నరసాపురం ఎస్ఐ శ్రీ జయ బాబు తన సిబ్బందితో కలిసి వెంటనే స్పందించి ఘటనాస్థలానికి చేరుకున్నారు. జేసీబీ, ట్రీ కట్టర్ల సహాయంతో రహదారిపై కూలిన చెట్టును తొలగించే చర్యలు చేపట్టారు.రహదారిపై ఉన్న చెట్టు కొమ్మలు, ఇతర అడ్డంకులను తొలగిస్తూ వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.తుపాను ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అత్యవసర సమయాల్లో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడకుండా పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు.ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించిన ఎస్ఐ జయ బాబు, పోలీసు సిబ్బంది చర్యలు అభినందనీయం.ఈ సందర్భంగా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈదురు గాలులు వీచే సమయంలో చెట్ల కింద, ప్రమాదకర ప్రాంతాల్లో నిలబడ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా, విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తక్షణ సహాయక చర్యలు చేపట్టడంలో ఏలూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని టి నర్సాపురం ఎస్ఐ జయ బాబు గారు స్పష్టం చేసినారు

పోలింగ్ సామాగ్రితో గ్రామాలకు బయలుదేరిన సిబంది

ప్రభాతవార్త చాట్రాయి మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుల ఎన్నికలకు సర్వం సన్నద్ధమైంది. మండల పరిషత్ కార్యాలయం నుండి పోలింగుకు కావలసిన సామాగ్రిని తీసుకొని సిబ్బందికి కేటాయించిన గ్రామాలలోని పోలింగ్ బూత్ లకు తరలి వెళ్తున్నారు. తుఫాన్ కారణంగా ఎన్నికలు వాయిదా పడతాయని వార్తలు రావటంతో కొంతసేపు గందరగోళ వాతావరణం నెవలకొంది. ఎటకాలకు ఎన్నికల కమిషనర్ ఎన్నికలు జరిపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బుధవారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది తమ సామాగ్రిని తీసుకొని ప్రభుత్వం కేటాయించిన వాహనాలలో పూర్తి బందోబస్తు మధ్య బయలుదేరారు. చాట్రాయి మండలంలో 15 ఎంపీటీసీలకు గాను 51 బూత్ లు ఉండగా 41 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనిలో పురుషుల ఓట్లు 20,594 మంది ఉండగా, మహిళల ఓట్లు 20387 మంది ఉన్నారు.

పూర్తి బందోబస్తు

గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశామని చాట్రాయి ఎస్ఐ డి రామకృష్ణ చెప్పారు. గ్రామాలలో ఈరోజు సాయంత్రం నుండి పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తామని శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలింగ్ సరళిలో ఏమైనా పొరపాట్లు జరిగితే ముందుగా పోలీసులకు పోలింగ్ సిబ్బందికి తెలియచేయాలని అంతేగాని ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నం చేయరాదని అని చెప్పారు. చాట్రాయి మండలంలో 18 గ్రామ పంచాయతీలతో పాటు శివారు గ్రామాలలో కూడా పోలీస్ పహరా జరుగుతుందని ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు

వరిలో ఉన్న అధిక నీటిని బయటికి పంపండి వ్యవసాయ అధికారి శివశంకర్

చాట్రాయి, నవంబర్ 4 ప్రభాతవార్త మురసు తుఫాను వలన కురిసిన అధిక వర్షాలకు వరి పంట దెబ్బతినకుండా రైతులు నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలని అధికముగా కురిసిన వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపాలని మండల వ్యవసాయ అధికారి బి శివశంకర్ అన్నారు. పడిపోయిన పంటలో కంకి విత్తనాలు మొలకెత్తకుండా, రంగు మారకుండా నివారించేందుకు లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు కలిపి 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయాలని తెలియ చేశారు.వరి గింజలు రంగు మారకుండా పొడ తెగులు, మాని పండు తెగులు రాకుండా ఒక ఎకరానికి ప్రోపికోనజోల్ 25 శాతం ఈసీ మందును 200 మిల్లీ లీటర్లు (లేదా) హేక్సకోనజోల్ 5 శాతం ఎస్సీ మందును 400 మిల్లీ లీటర్లు నీటిలో కలుపుకొని పిచికారి చేసిన యెడల నష్టం వాటిల్లకుండా పంటను కాపాడుకోవచ్చు అన్నారు. ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాలలో నీరు తగ్గించిన వెంటనే పైపాటుగా ఎకరానికి 20 కేజీలు యూరియాను మరియు 20 కేజీలు పొటాష్ ను పంట ఎదుగుదలకు చల్లుకోవాలని అతిముఖ్యంగా వర్షాల ప్రభావం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరించిన విధంగా ఈ రెండు రోజులు వరి కోతలు ఆపుకోవడం మంచిదని సూచించారు.

తరలి వెళ్లిన పోలింగ్ సిబ్బంది

అత్తిలి, నవంబర్ 4(ప్రభాత వార్త) అత్తిలి మండలంలో గురువారం నిర్వహించే 19 ఎంపీటీసీ పదవులు, ఒక జడ్పిటిసి పదవుల కోసం నియ మితులైన సిబ్బంది అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన పంపిణీ కేంద్రం నుండి పోలింగ్ సామాగ్రిని పొంది తరలి వెళ్లారు. తోలుత అత్తిలి ఎస్ వి ఎస్ ఎస్ డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేయాలని ఎన్నికల అధికారులు నిర్ణయించగా మురుసు తుఫాను కారణంగా కళాశాల గ్రౌండ్ వర్షం నీటితో మునిగిపోయింది. దీనితో పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మండపానికి మార్చారు. రిటర్నింగ్ అధికారి యు. మంగపతిరావు పర్యవేక్షణలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ పత్రాలను అందజేశారు. మండలంలోని 68 పోలింగ్ కేంద్రాలకు 449 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. మండలంలోని 19 గ్రామాలను 8 రూట్లు గా విభజించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు తణుకు రూరల్ సీఐ డి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ముగ్గురు ఎస్సైలు 120 మంది పోలింగ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై కేవిన్ విశ్వనాథ్ తెలిపారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ప్రజల సహకరించాలని అధికారులు కోరారు.

మురుసు తుఫానుతో పల్లపు ప్రాంతాలు జలమయం

అత్తిలి, నవంబర్ 4 (ప్రభాతవార్త) అత్తిలి మండలంలో మురుసు తుఫాను ప్రభావంతో మంగళవారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పల్లపు ప్రాంతాలకు జలమయం అయ్యాయి. రోడ్ల వెంబడి వర్షపు నీరు నిండిపోయింది. పోలీస్ స్టేషన్, ఎన్టీఆర్ నగర్, మట్టపర్తి గర్వ్,గోగులంపేట, రామన్నపేట తదితర ప్రాంతాలలోని పల్లపు ప్రాంతాలు మునిగిపోయాయి. డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని ఈర్లకోడు, రాచకోడు, మంచిలి డ్రైన్,పాలి డ్రైన్ పొంగి ప్రవహిస్తున్నాయి. పంట చేలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అత్తిలిలోని ప్రసిద్ధ ఉమా సిద్దేశ్వర స్వామి వారి ఆలయంలోని మూలవిరాట్ కూడా నీట మునిగింది. ఈ ఆలయంలోని మూలవిరాట్ భూమికి ఆరు అడుగుల దిగువన ఉండటంతో మూల విరాట్ ముంపునకు గురైంది.

వానొచ్చే..! వరదలు ముంచే!!

- తడిసి ముద్దయిన మెట్ట, ఏజెన్సీ ప్రాంతాలు
- ఎడతెరిపి లేని వర్షం.. తో అతలా కుతల మైన జన జీవనం
- ఈ దురు గాలులకు విరిగి పడ్డ భారీ వృక్షాలు
- చెరువుల్లా రోడ్లు..పొంగు తున్న కొండ వాగులు
- ఏజెన్సీ గ్రామాలకు రాక పోకలు బంద్
- సహాయక చర్యలలో పోలీసులు.. స్థానికులు

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త ప్రతినిధి ఏలూరు జిల్లా లో గత రెండు రోజులు గా కురుస్తున్న భారీ వర్షాలు కారణం గా జన జీవనం అతలా కుతల మైంది. మరో రెండు రోజులు ఇందే పరిస్థితని అధికారులు హెచ్చరిక చేశారు. ముఖ్యంగా జంగారెడ్డిగూడెం డివిజన్ లోని ఏజెన్సీ గిరిజన గ్రామాలు మెట్ట ప్రాంతం లో గల పలు ఏరియాలు తుపాను నేపథ్యంలో కురిసిన వానల మూలంగా కొండ వాగులు పొంగు తున్నాయి.ఎగువ నుంచి వచ్చే వరదల వల్ల చిన్న కాలువలు, వాగులు వంకలు సైతం మాదారి రహదారి అనుకుంటూ వరద నేటి తో ప్రమాదకరంగా ప్రవహించడం కని పించింది.డివిజన్ కేంద్ర మైన జంగారెడ్డిగూడెం లో అన్ని ప్రధాన రోడ్లు వరద నీటి లో మునిగి పోయాయి.రోడ్లు కాలువ లా అన్నట్టుగా వరద ముంచేత్తింది. ముఖ్యం గా అశ్వారావుపేట రోడ్డు లో ఎగువ సబ్ స్టేషన్ ఏరియా కొండ ప్రాంతం కానుక గతం లోగల పల్లె చెరువులోకి వరద చేరింది. అయితే అక్కడ పలు నిర్మాణాలు జరిగిన నేపథ్యంలో రోడ్డు మీదే వరద నీరు ప్రవాహం ముంచేత్తింది. అలాగే అదేరీతి లో ప్రధాన రహదారి కాలవ లా మారింది. ఏలూరు రోడ్డు కూడా వరద లో నే మునిగింది. ఇటీవల వేసిన రోడ్డు ఐసి ఐసి ఐ బ్యాంక్ వద్ద తాటా కాన్ని తల పింపజేసింది.కొత్త బస్ స్టాండ్ తదితర ప్రాంతాలు నీరు దిగువస్థాయి కి వెళ్లే మార్గం డ్రైన్ వ్యవస్థ లేక రాక పోకల కు అంత రాయం ఏర్పడింది.

కొట్టు కు పోయిన హైవే వంతెన సపోర్టు..

ఏజెన్సీ ప్రాంతం లోని బుట్టాయి గూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల కు సంబందించిన ప్రాధాన రహదార్లులో వరద మూలంగా రాక పోకల కు అంత రాయం ఏర్పడింది. బుట్టాయి గూడెం –రెడ్డి గణపవరం మార్గం లో నిర్మాణం లో వున్న జాతీయ రహదారి బి బి 365 లో గల వంతెన వరద ఉద్రుతికి కొట్టు కు పోయింది. అలాగే కన్నాపురం మార్గం లో పలు జల్లేరు, అలుగు వాగులు పొంగాయి.దీనితో వాహనాలు నిలిచి పోయాయి. పోలవరం మండలం లోను ఇదే పరిస్థితి నెలకొంది. జీలుగుమిల్లి మండలం లోని పలు చోట్ల వాగులు రావడం తో గంటలతరబడి ట్రాఫిక్ నిలిచి పోయింది.

టి నర్సాపురం పోలీసులసేవ అద్భుతం..

ఇదిలా ఉంటే టి. నర్సాపురం మార్గం లో భారీ వృక్షం కూలి పోయి రాక పోకలు నిలిచి పోయాయి. జిల్లా అధికారుల ఆదేశాలతో అక్కడి ఎస్ ఐ జయ బాబు వారి సిబ్బంది కొన్ని గంటలు శ్రమించి చెట్టు భాగాలు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. జోరు వానలో సైతం పోలీస్ సిబ్బంది శ్రమించి ఇబ్బందులు క్లియర్ చేశారు. అలాగే ఏలూరు మార్గం లో ఆడమిల్లి వద్ద గత ఏడాది

గా నిర్మాణం జరుగుతున్న కలవర్డ్ వద్ద తూర కొట్టు కు పోయింది దీనితో తడిక ల పూడి ఎస్ ఐ పద్మ వల్లీ దగ్గర ఉండి ట్రాఫిక్ మల్లించారు. రెవిన్యూ, పోలీసు శాఖలు అప్రమత్తం కావడం మూలంగా ఎక్కడ అవాంఛ నీయఘటనలు నమోదు కాలేదు.

భారీ వర్షాలతో అతలాకుతలమైన వేలేరుపాడు మండలం

- పొంగిపొర్లుతున్న వాగులు.. నీటమునిగిన పంట పొలాలు
- పెద్దవాగు ప్రాజెక్టుకు గండి.. కమ్మరిగూడెం గ్రామం జలమయం
- వరదలతో స్తంభించిన రవాణా.. విద్యుత్ అంతరాయం

వేలేరుపాడు, నవంబర్ 4(ప్రభాత వార్త): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, ముసురు తుఫాను ప్రభావంతో వేలేరుపాడు మండలం అతలాకుతలమైంది. మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పంట పొలాలు నీటమునిగాయి. అకాల వర్షాలు అన్నదాతలను తీవ్ర నష్టాల్లోకి నెట్టాయి. పలు గ్రామాల్లో వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెద్దవాగు ప్రాజెక్టుకు గండి :

తెలంగాణ రాష్ట్రంలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడటంతో వరద నీరు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోకి భారీగా చేరింది. దీంతో కమ్మరిగూడెం, అల్లూరి నగర్ గ్రామాలు పూర్తిగా నీటమునిగగా, మద్దిగట్ల, గుల్లవాయి గ్రామంలోకి సైతం వరద నీరు ప్రవేశించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల పెద్దవాగు నిర్వాసితులను అన్ని శాఖల అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టారు.

స్థంభించిన రవాణా వ్యవస్థ :

మండలంలోని ప్రధాన రహదారులు వరద నీటిలో మునిగిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. కోయిదా--వేలేరుపాడు మార్గంలో నార్లవరం వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అశ్వారావుపేట--వేలేరుపాడు మార్గంలో సైతం వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సహాయక చర్యలకు కూడా ఆటంకాలు ఎదురవుతున్నాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం :

భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్‌ఫోన్ సేవలు సైతం నిలిచిపోవడంతో సమాచార వ్యవస్థ దెబ్బతింది. విద్యుత్ లేకపోవడం సహాయక చర్యలకు

ఆటంకంగా మారింది.

పంటలంత నీరు రైతన్న కంట్లో కన్నీళ్లు :

ఒకవైపు సాగునీరు లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు నీటి కోసం ఎదురుచూసిన రైతులకు,మరోవైపు అకాల వర్షాలు తీవ్ర పంట నష్టాన్ని మిగిల్చాయి. చేతికొచ్చే పంటలు నీటమునగడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు.

వరద బాధితుల విజ్ఞప్తి :

వరద ప్రభావిత గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు. పంట నష్టాలను తక్షణమే అంచనా వేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు

తీరంలో బ్యాలెట్ పోరుకు సర్వం సిద్ధం...

వర్షం పడుతున్నా బూత్ లు మడుగులో ఉన్నా... తీర్పు చెప్పక తప్పదు

నరసాపురం నవంబర్ 4 ప్రభాతవార్త గడచిన 24 గంటల్లో నరసాపురంలో 25 సెంటీమీటర్లు పైగానే వర్షపాతం నమోదయింది. బుధవారం సాయంత్రం కూడా పలుచోట్ల వర్షం పడింది. గత పది రోజులుగా రెండు తుపానులు తీరాన్ని కుదిపివేశాయి. పడని చెట్టు లేదు రాలనీ కాయలు లేవు . రోడ్లు ఇంకా మడుగు లోనే ఉన్నాయి. గ్రామీణ పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించే పాఠశాలలు చుట్టూ వర్షపు నీటితో నిండి మడుగులా ఉన్నాయి. కానరాని దారులు కొన్ని చోట్ల కటిక చీకటి. ఇటువంటి విపత్కర పరిస్థితిలో నేడు పోలింగ్ అనివార్యమైంది. 28 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నిక నిమిత్తం అధికారులు సర్వం సిద్ధం చేశారు. తొమ్మిది రూట్లలో 75 పోలింగ్ కేంద్రాలకు దాదాపు 500 మంది పైగా సిబ్బంది వారితో పాటు రెవెన్యూ పోలీస్ యంత్రాంగం బయలుదేరింది. స్థానిక శ్రీ లక్ష్మీ థియేటర్ హాలులో సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని బ్యాలెట్ లను పోలింగ్ బాక్సులను అప్పగించారు. వీరంతా బుధవారం మధ్యాహ్నం నుండి పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. సగానికి సగం పోలింగ్ కేంద్రాలు నరసాపురం మొగల్తూరు ప్రాంతాల్లో తీర గ్రామాలలోనే ఉన్నాయి. వరుస తుఫాన్లతో ఈ గ్రామాలు ఇంకా ఊపిరి తీసుకోలేదు. వర్షపు నీరు అంధకారంతో ఒక్కిరిబిక్కిరిలో ఉన్నాయ చాలామంది పోలింగ్ వాయిదా పడుతుందని భావించారు. కానీ యధావిధిగా అధికారులు పోలింగ్ నిర్వహిస్తున్నారు. వాతావరణ పరిస్థితి బాగోనందున పోలింగ్ శాతం అనుకున్న మేర ఉండకపోవచ్చునని అయితే గురువారం పొడి వాతావరణం ఉంటే మాత్రం కొన్ని గ్రామాలలో 80 నుండి 90 శాతం కూడా పోలింగ్ జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. గ్రామాల్లో కూటమి వైపిపి పోరు ఏ మేరకు ఉందో రేపటి ఫలితాన్ని బట్టి ఉంటుంది.

కుప్ప కూలిన జాతీయ రహదారి వంతెన సెంట్రింగ్

వీరన్న పాలెం వద్ద భారీ వరద కు దెబ్బ తిన్న నిర్మాణం - ఛత్తిష్ ఘడ్ ఒరిస్సా జాతీయ రహదారి పై ఘటన

జంగారెడ్డిగూడెం /బుట్టాయి గూడెం, ప్రభాత వార్త ఛత్తిష్ ఘడ్ రాష్ట్రం నుంచి ఒరిస్సా వరకూ 4 స్టేట్ లను కలుపుతూ శర వేగంగా నిర్మాణం జరుపు కుంటున్న జాతీయ రహదారి బి బి 365 కోసం బుట్టాయి గూడెం మండలంవీరన్న పాలెం వద్ద నిర్మాణం లో వున్న వంతెన కు సంబంధించిన సెంట్రింగ్ వరద తాకిడి కి కుప్ప కూలి పోయింది. బుధవారం మధ్య హన్నం ఈ సంఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కధనం ప్రకారం ఉదయం రెండు రోజులు గా కురుస్తున్న భారీ వర్షం మూలంగా ఏజెన్సీ ఎగువ నుంచి వరద నీరు దిగువస్థాయికు ప్రవహించడంజరుగుతుంది. ఈ నేపథ్యంలో నిర్మాణం లోని జాతీయ రహదారి విస్తరణ కై జరుగుతున్న పనుల్లో భాగం గా వంతెన ఏర్పాటు చేయడం కోసం కాంట్రాక్ట్ ఏజెన్సీ సెంటరింగ్ సిద్ధం చేసింది. మరో రెండు రోజుల్లో స్లాబ్ వెయ్యాల్సి వుంది. అనూహ్య పరిస్థితి లో వచ్చి తుపాను వల్ల కురిసిన భారీ వర్షం వరద గా మారిభారీ ప్రవాహం రావడం తో స్థానికులు చూస్తూ ఉండగానే వంతెన సెంటరింగ్ కూలి పోయింది.

జిల్లా ఏజెన్సీ కి గుండె వంటి మార్గం

కాగాఏలూరు జిల్లా ఏజెన్సీ కి ముఖ్య రహదారి అయిన ఈ రోడ్డు లో పలు కొండ వాగులు కా లువ లు ఉన్నాయి.ఛత్తిష్ ఘడ్, తెలంగాణ, ఎపి ఒరిస్సా లకు సంబందించిన ఈ జాతీయ రహదారి పూర్తి అయితే ఏజెన్సీ గిరిజన ప్రాంతాలలో ప్రయాణం సులువుగా మారుతుంది సుమారు యాభై కిలోమీటర్లమేర జీలుగుమిల్లి నుంచి బుట్టాయ్ గూడెం, పోలవరం మండలాల వరకూ ఇదే ప్రధాన రహదారి. తాజా గా దీన్ని రాజమండ్రి ఎంపి పురందేశ్వరి మరింతగా విస్తరణ చేయాలని అదనపు నిధులు మంజూరు చేయించారు. గత మూడేళ్లు గా నిర్మాణం లో వున్న ఈ జాతీయ రహదారిపూర్తి కావాలి అంటే మరో రెండేళ్లు పడుతుందని అంచనా.

ముంచేసిన మురుసు తుఫాన్

పొంగిన వాగులు, తెగిన రహదారులు స్తంభించిన జనజీవనం

జీలుగుమిల్లి, అక్టోబర్ 04, (ప్రభాతవార్త) గత వారం రోజుల క్రితం కురిసిన ఆర్నాబ్ తుఫాన్ నష్టం మరవక ముందే ఇప్పుడు వచ్చిన మురసు తుఫాన్ కనువిని ఎరుగని రీతిలో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేయగా, రహదారులు పూర్తిగా తెగిపోవడంతో మండల కేంద్రం జీలుగుమిల్లికి మిగిలిన గ్రామాలకు పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. ముఖ్యంగా మండలంలోని జీలుగుమిల్లి నుండి జంగారెడ్డిగూడెం వైపు వెళ్లే జాతీయ రహదారికి లక్ష్మీపురం వద్ద తెగిపోయింది. దీంతో వందలాది వాహనాలు వెను తిరిగి సత్తుపల్లి మీదగా గ్రీన్ ఫీల్డ్ హైవేపై వెళ్లేందుకు సిద్ధమయ్యాయి. జీలుగుమిల్లి బుట్టాయిగూడెం మధ్య నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి వరద ఉధృతికి కనిపించకుండా పోయింది. అదేవిధంగా మండలంలోని మండలంలోని వంకవారిగూడెం, ములగలంపల్లి వద్ద ఎలకల వాగు కల్వర్టు కొట్టుకుపోయింది. జీలుగుమిల్లి బుట్టాయిగూడెం, రాచన్న గూడెం కామయ్యపాలెం మధ్య, రాచన్నగూడెం అంకన్నగూడెం మధ్య వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మండలంలోని పంట నష్ట వివరాలు తెలియాల్సి ఉంది. నేడు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ పై వరద ప్రభావం పడే అవకాశం ఉందని ప్రజల భావిస్తున్నారు. ఈ తుఫాన్ వల్ల ఎక్కడ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ముందస్తు జాగ్రత్తగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఎలాంటి ఆస్తి ప్రాణ ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి పోలీస్ రెవెన్యూ అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు

చైర్మన్ శైలజకు పలువురి అభినందన

నరసాపురం నవంబర్ 4 ప్రభాతవార్త పట్టణ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన కొత్తపల్లి శైలజను పలువురు నేతలు కౌన్సిలర్లు అధికారులు బుధవారం కలిసి అభినందించారు. జనసేన బిజెపి టిడిపి నాయకులు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పి రామరాజు తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ కౌన్సిలర్ కొత్తపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు రేపటికి వాయిదా

జీలుగుమిల్లి, నవంబర్ 04, (ప్రభాతవార్త) మండలంలో నేడు జరగాల్సిన ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు తుఫాన్ ప్రభావం రీత్యా రేపటికి వాయిదా పడినట్లు మండల అభివృద్ధి అధికారి కె.వెంకటలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురసు తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో రహదారులు తెగిపోవడం, విద్యుత్ అంతరాయం తదితర కారణాలు వల్ల మండలంలోని అన్ని గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా తెగిపోవడంతో పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు వచ్చే పరిస్థితి లేదని అలాగే ఎలక్షన్ సిబ్బంది పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి కూడా వీలు లేకపోవడంతో 05 వ తారీఖున జరగాల్సిన ఎన్నికలను 06వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ఈ విషయాన్ని ఓటర్లు గమనించాలని తెలియజేశారు

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి: సివి కాళీ చరణ్

కాళ్ళ నవంబర్4 (ప్రభాతవార్త) ఎలక్షన్ జరుగు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కాళీ చరణ్ అన్నారు. మండలంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎలక్షన్లు సంబంధించి ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కాళీ చరణ్, బందోబస్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందితో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు సంబంధించిన విషయాలు తెలిపారు. హైపర్ సెన్సిటివ్ ఏలూరుపాడు గ్రామంలో పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి బందోబస్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందితో ఎలక్షన్ జరుగు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గణేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

ముమ్మరంగా విద్యుత్ పనులు

నరసాపురం ప్రభాతవార్త అరణబ్ మురసు తుఫాన్లతో దెబ్బతిన్న విద్యుత్ సర్వీసులను పునరుద్ధరించడానికి విద్యుత్ శాఖ వందలాది మంది సిబ్బందితో సాయ శక్తుల కృషి చేస్తోంది. భారీ క్రేన్లను తీసుకువచ్చి స్తంభాలను వైర్లను మరమ్మత్తు చేస్తున్నారు. అందుకోసం విద్యుత్తు లైను కూడా ఆపి కరెంటును ఎక్కువగా రాత్రి సమయంలోనే ఇస్తున్నారు. అయితే ఇంకా 40 శాతం ప్రాంతానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. చాలా గ్రామాలలో ఆక్వా చెరువులకు కూడా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు.

ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం మానవత్వం

-మెంటేవారి తోటలో వరద బాధితులకు భోజనాలు అందించిన మెంటే దేవి

భీమవరం నవంబర్ 4 ప్రభాతవార్త ఆపదలో వారికి వరద బాధితులకు సహాయ సహకారాలు అందించడం మానవత్వమేనని మాజీ ఎంపీ మెంటే పద్మనాభం కోడలు మెంటే దేవి మనోహర్ అన్నారు. వరద ప్రభావ ప్రాంతాలైన భీమవరం మెంటేవారి తోటలో బుధవారం మెంటే దేవి పర్యటించారు. ఈ సందర్భంగా 64 కుంటుబాలకు ఉచితంగా ఆహార పోట్లను అందించారు. తుపాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాల వారంతా చాలా ఇబ్బందులు పడ్డారని, ఇటువంటి వారికి సహకారం అందించడం మనందరి కర్తవ్యమని అన్నారు. కార్యక్రమంలో మెంటే మనోజ్, తోట సురేష్, షేక్ రెహమాన్, మేడిశెట్టి లోవరాజు, బాతు నరేష్, మెంటే అప్పారావు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ ప్రభావం కొయ్యలగూడెంలో

ముమ్మరంగా సహాయక చర్యలు

కొయ్యలగూడెం నవంబర్ 4 ప్రభాత వార్త ?మురసు తుఫాన్ ప్రభావంతో కొయ్యలగూడెం మండలంలో ముందస్తు సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు మండల యంత్రాంగం వెల్లడించింది. తుఫాన్ కారణంగా మండలంలో భారీ వర్షపాతం నమోదైందని, అధికారిక గణాంకాల ప్రకారం ఇవాళ సాయంత్రం 6.00 గంటల నాటికి ఉదయం 8.30 గంటల నుండి మొత్తం 224.20 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు మండల వ్యాప్తంగా 5 పునరావాస కేంద్రాలు మరియు 5 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 88 కుటుంబాలకు చెందిన మొత్తం 222 మందికి పునరావాస కేంద్రాల్లో సురక్షిత ఆశ్రయం కల్పించి, అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. మండలంలో మొత్తం 113 ఇళ్లు వరద నీటిలో చిక్కుకోగా, 2 ఇళ్లు దెబ్బతిన్నాయి. వర్షపు నీరు రహదారులపై ప్రవహించడం వల్ల 5 ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అచ్యుతాపురం గ్రామంలో 4 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నప్పటికీ, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావంతో మండలంలోని 6 చిన్న నీటిపారుదల చెరువులు దెబ్బతిన్నాయి; ఇందులో బోడిగూడెం గ్రామంలోని రాయుడు చెరువు, అచ్యుతాపురం గ్రామంలోని బండబత్తుల చెరువులకు గండ్లు పడగా, మరో 4 చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద నీరు ప్రవహిస్తున్న రహదారులు, వాగులు, చెరువులను దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో ప్రజలు అధికారుల సూచనలు విధిగా పాటించాలని కోరారు.

రాత్రి గెలిచారు... పొద్దున్నే జనాల్లోకి...

సమస్యల పరిష్కారానికి వెనువెంటనే చర్యలు

నరసాపురం నవంబర్ 4 ప్రభాతవార్త నూతనంగా మున్సిపల్ చైర్మన్ గా గెలిచిన కొత్తపల్లి శైలజ స్థానిక ఒకటో వార్డులో పంపు హౌస్ వద్ద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వాటర్ వర్క్స్ ముంపు వల్ల కొళాయినీరు సరఫరా ఇబ్బంది వస్తుందని గ్రహించి వెన్ను వెంటనే శ్రీహరి పేటలో ఉన్న కుళాయి చెరువు ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ ఓ వృద్ధురాలు తమ ఇంటి కనెక్షన్ కట్ చేశారని చెప్పడంతో వెంటనే దాన్ని పునరుద్ధరించమని చెప్పారు. కొత్తపల్లి జానకిరామ్ వార్డు కౌన్సిలర్ సందక సురేష్ పాల్గొన్నారు.

భీమవరంలో అత్యవసర ముందస్తు పునరావాస కేంద్రాలు : రామచంద్రారెడ్డి

భీమవరం టౌన్,నవంబర్ 4 : ప్రభాతవార్త మురుసు తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, నందమూరు లాకుల నుండి అధిక మొత్తంలో వర్షపు నీటిని దిగువ కు విడుదల చేస్తున్నందున యనమదురు డ్రెయిన్‌లో నీటిమట్టం పెరిగి పరిసర లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున భీమవరం పురపాలక సంఘం ముందస్తు అప్రమత్తత చర్యలు చేపట్టింది.దీ నిలో భాగంగా ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు దుర్గాపురం లోని బీవీరాజు హైస్కూల్, మెంటే వారి తోటలోని మీనాక్షి స్కూల్, మెంటే వారి తోటలోని జివిఆర్ కాలేజ్ ప్రాంతాలలో పునరా వాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆయా కేంద్రా లకు ప్రత్యేక అధికారులను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ పురపాలక సంఘ కమిషనర్ కె. రామచంద్ర రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.పున రావాస కేంద్రాలలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు మరియు దివ్యాంగులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, పునరావాస కేంద్రాలలో బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ తదితర పారిశుద్ధ్య సామగ్రిని అందుబా టులో ఉంచి, పారిశుద్ధ్య సిబ్బందితో నిరం తరం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. రాజేష్‌ను ఆదేశించారు. కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు.అత్యవసర పరిస్థితులకు సంబంధించి ప్రజలు ముందస్తు సమాచారాన్ని 08816-234284 నంబర్కు అందజేయాలి ఓవరాల్ ఇన్‌చార్జి : అసిస్టెంట్ కమిషనర్ ఎ రాంబాబు, సెల్ నంబర్ 9849907154 కు సమాచారం తెలియ జేయాలి.

పశ్చిమగోదావరిలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

భారీ వర్షంలోనూ అధికారులు, సిబ్బంది నిర్విరామ కృషి ప్రశంసనీయం

ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి

భీమవరం, నవంబరు 4 ప్రభాతవార్త ఆర్నబ్ తుఫాను కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఆర్నబ్ తుఫాను కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని పలు జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ పనుల పర్యవేక్షణా బాధ్యతలను ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటికి అప్పగించారు. ఈ సందర్భంగా సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేసే అంశంపై విద్యుత్ శాఖ అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధనశాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేశామని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో భారీ వర్షాలు, బలమైన గాలి కారణంగా 33కెవి సబ్- స్టేషన్లు-98, 33కెవి ఫీడర్లు- 67, విద్యుత్ స్తంభాలు-8,859 11కెవి ఫీడర్లు-475, 516 ట్రాన్స్ ఫార్మర్లు, 755 కి. మీ. మేరకు విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో జిల్లాలోని 6 పట్టణాలు, 20 మండలాల్లోని 409 గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారులకు వీలైనంత తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను అందించాలనే ధ్యేయంతో భారీ వర్షాన్ని, బలమైన గాలిని సైతం లెక్కచేయకుండా అధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను చేపట్టడంతో త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. బుధవారం సాయంత్రానికి 6 పట్టణాలు, 409 గ్రామాలకూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇక జిల్లాలో 17 వేల అక్వా సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడగా 14వేల సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించడం జరిగిందన్నారు. మిగిలిన అక్వా సర్వీసులతోపాటు వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు కూడా ఒకట్రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరఫరాను పునరుద్ధరించేందుకు గత వారం రోజులుగా భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్విరామంగా కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఎక్కడైనా గృహ విద్యుత్ సర్వీసులకు విద్యుత్ సరఫరా లేనట్లయితే సరఫరా పునరుద్ధరణ కోసం వినియోగదారులు కంట్రోల్ రూమ్ మొబైల్ నంబరు: 9490610152కు కాల్ చేయవచ్చని తెలియజేశారు. వెంటనే సరఫరా పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

మాజీ శాసన మండలి చైర్మన్ చక్రపాణి మృతి రాష్ట్రానికి తీరని లోటు

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు

భీమవరం నవంబర్ 4 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి మాజీ చైర్మన్ డాక్టర్ అప్పనబోయిన చక్రపాణి మృతి పట్ల ఏపీ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి, ముఖ్యంగా శాసన వ్యవస్థకు తీరని లోటని పేర్కొన్నారు. శాసన మండలి ఔన్నత్యాన్ని కాపాడటంలో చక్రపాణి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డాక్టర్ అప్పనబోయిన చక్రపాణి 2007 నుంచి 2011 వరకు, తిరిగి 2011 నుంచి 2017 వరకు రెండు పర్యాయాలు ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై సభను అత్యున్నత విలువలతో నడిపించారని గుర్తుచేశారు. గతంలో 1983 నుంచి 1985 వరకు మండలి డిప్యూటీ చైర్మన్‌గా, ప్రభుత్వ చీఫ్ విప్‌గా కూడా సేవలందించారని తెలిపారు. కర్నూలు జిల్లా హుస్సేనాపురానికి చెందిన చక్రపాణి న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించిన విద్యావేత్త, మేధావి అని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం లా కాలేజీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీలో పలు కీలక పదవుల్లో పనిచేశారని తెలిపారు. బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి సహకార రంగం ద్వారా విశేష కృషి చేశారని, గ్రంథాలయోద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. 'ఆంధ్ర జనతా' దినపత్రిక సంపాదకుడిగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు రాజ్యాంగం, శాసన వ్యవస్థలకు సంబంధించి పలు విలువైన పుస్తకాలను రచించారని గుర్తుచేశారు. శాసన మండలి గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కాపాడటంలో చక్రపాణి చూపిన మార్గం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని మోషేను రాజు పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూవారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మురుసు తుఫాను పునరావాస కేంద్రాలు ఏర్పాటు

భీమవరం, నవంబర్ 4 ప్రభాతవార్త మురుసు తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, నందమూరు లాకుల నుండి అధిక మొత్తంలో వర్షపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున యనమదురు డ్రెయిన్‌లో నీటిమట్టం పెరిగి పరిసర లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున భీమవరం పురపాలక సంఘం ముందస్తు అప్రమత్తత చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా పట్టణంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బీవీ రాజు హై స్కూల్, దుర్గపురం, మీనాక్షి స్కూల్, మెంటవారితోట, జీవీఆర్ కాలేజీ, మెంటవారితోట ప్రాంతాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆయా కేంద్రాలకు ప్రత్యేక అధికారులను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ పురపాలక సంఘ కమిషనర్ కె. రామచంద్ర రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పునరావాస కేంద్రాలలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు మరియు దివ్యాంగులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, పునరావాస కేంద్రాలలో బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ తదితర పారిశుద్ధ్య సామగ్రిని అందుబాటులో ఉంచి, పారిశుద్ధ్య సిబ్బందితో నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. రాజేష్‌ను ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు -- అత్యవసర సమాచారం కోసం సంప్రదించండి: ప్రజలకు అందుబాటులో ఉండేలా భీమవరం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడింది. వర్షాలు, వరద ముంపు, లోతట్టు ప్రాంతాలలో నీటిమట్టం పెరుగుదల లేదా ఇతర అత్యవసర పరిస్థితులకు సంబంధించి ప్రజలు ముందస్తు సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు అందించవలసిందిగా కోరారు.కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08816-234284 ఓవరాల్ ఇన్‌చార్జి: అసిస్టెంట్ కమిషనర్ ఎ . రాంబాబు సెల్ నంబర్: 9849907154 లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలు ఏవైనా ముంపు పరిస్థితులను గుర్తించిన వెంటనే పై నంబర్లకు సమాచారం అందించాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ అవసరమైనప్పుడు సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని పురపాలక సంఘం విజ్ఞప్తి చేస్తోంది. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పురపాలక సంఘం అన్ని ముందస్తు చర్యలు చేపడుతూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని కమిషనర్ తెలిపారు.

సేవకు.. వేళాయే!

- విజేత కు జనం నీరాజనం
- నిన్న గెలిచారు.. నేడు సేవకు సిద్ధ పడ్డారు
- వరద బాధితులకు మున్సిపల్ చైర్ పర్సన్ అనూష అండ

జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త సేవకు ముహూర్తం అవసరం కాదని సమయం సందర్భం ఉంటే అదే సేవకు శ్రీకారం అని నిరూపించారు మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన రొంగిల అనూష. మురుసు తుపాను కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలు నీట మునిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే సమయం మే తన సేవా ముహూర్తం అని ఆమె నమ్మి నడుం బిగించారు. బుధవారం అదే సమయం లో ఆమె మున్సిపల్ ఎన్నికల్లో చైర్ పర్సన్ గా ఎన్నిక య్యారు.. సరిగా కొన్ని గంటలు గడవకముందే ఆమె జోరు వానను లో ప్రజా సేవకు సన్నద్ధమయ్యారు.వారి కుటుంబం కూడా ఆమె వెంట నడిచారు.గురువారం మున్సిపాలిటీ పరిధిలో కొన్ని ప్రాంతాల ప్రజలు భారీ వర్షానికి వరద తాకిడికి గురై ఇబ్బంది పడుతున్న సమాచారం తెలుసు కుని నేరుగా అనూష వారిని కలిసారు. 15వ వార్డు, మునసబు వారి వీధి, ఆంజనేయస్వామి గుడి వెనుక ఊరచెరువు ప్రాంతం లో పలు ఇళ్ళ నీట మునిగాయి.వారిని కలిసి పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. శాసనసభ్యుడు స రోషన్ కుమార్ సొంగా సూచనల మేరకు అనూష వరద ప్రభావిత ప్రాంతంలో సహాచర్యలు చేపట్టారు బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. టీమ్ స్పిరిట్ తో ముందు కు వచ్చిన వార్డ్ కౌన్సిలర్ ఈ నేపథ్యంలో 15వ వార్డు కౌన్సిలర్ రాగోలు లక్ష్మి కుమారుడు రామకృష్ణ ఆధ్వర్యంలో బాధితులకు ఉదయం 150 టిఫిన్లు, మధ్యాహ్నం 150 భోజన ప్యాకెట్లు, సాయంత్రం 150 భోజన ప్యాకెట్లు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఏ అవసరం వచ్చినా బాధితులకు అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చైర్ పర్సన్ అనూష భరోసా ఇచ్చారు.అలాగే వర్షపు నీరు మరోసారి వారి ఇళ్ల లోకి రాకుండా డ్రైనేజీ వ్యవస్థఅభివృద్ధి ఏర్పాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ విధంగా చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టకుండానే తన సేవా నిరతిని చాటు కున్న అనూష కు పలువురు అభినందనలు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెనుమర్తి రామ్ కుమార్, 26వ వార్డు కౌన్సిలర్ఆమె భర్త రొంగల దేవిప్రసాద్, రొంగిల నాగేశ్వరరావు, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తత, క్రమశిక్షణ కావాలి

సిబ్బంది కి పోలీసు అధికారుల సూచన - నేటి మండలఎన్నిక లకు భారీ బందోబస్త్

జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఎం వి సుభాష్ కోరారు. పోలీసు శాఖ ముందస్తు చర్యలులో భాగంగా గురు వారం సిబ్బంది తోఆయన మాట్లాడారు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, జంగారెడ్డిగూడెం డీఎస్పీ శ్రీ వెంకటేశ్వర్లు ఆదేశాలపై సీఐ సుభాష్ ఆధ్వర్యంలో ఎస్ఐ లు వీర ప్రసాద్, కుటుంబరావు, తడికలపూడి మహిళా ఎస్ఐ వల్లీ పద్మ పోలీసు సిబ్బంది కు పోలింగ్ కేంద్రాల వద్ద విధు ల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సమయంలో పాటించాల్సిన నియమాలు, చేయాల్సిన పనులు, చేయకూడని పనుల గురించి వివరించారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తూ, ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ పాటించడం, ఓటర్లకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం, ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. విధు ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించ కుండా, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని పోలీసు సిబ్బంది, వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు.

తుఫాన్ వేళ గర్భిణులకు భరోసా : డాక్టర్ ఎస్.శ్రీ వాసవి

పోడూరు,నవంబర్ 04,ప్రభాత వార్త : తుఫాన్ ప్రభావంతో గర్భిణులకు ఇబ్బందులు తలెత్తకుండా పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణీ స్త్రీలకు బుధవారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. తుఫాన్ కారణంగా రవాణా సమస్యలు ఎదురుకాకుండా గర్భిణులను పీహెచ్‌సీలో ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ఎస్. శ్రీ వాసవి తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని ఆదేశించారు. కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. కలుషిత ఆహారాన్ని తీసుకోకుండా వేడివేడి ఆహారం తినాలని తెలిపారు. వర్షాకాల వ్యాధుల నివారణకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు బుధవారం, శనివారం వేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.బి.కె.ఎస్. రమేష్ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి జె. సత్యనారాయణ, పి.హెచ్.ఎన్.ఎస్. మీరమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు సి.హెచ్.ఎస్.వి.ఎల్. పద్మకుమారి,పి.సుధారాణి తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు లో 65 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం

నూజివీడు,నవంబర్ 04 ప్రభాతవార్త: నూజివీడు రూరల్ మండలంలో గురువారం నిర్వహించనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్, పోలింగ్ బాక్స్ లను పోలింగ్ కేంద్రాలకు బుధవారం తరలించారు. రిటర్నింగ్ అధికారి రవికుమార్ మాట్లాడుతూ మండలంలో 65 పోలింగ్ కేంద్రాలలో, 95 పోలింగ్ బాక్సుల ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో 57,493 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు. వీరిలో పురుషులు 28,418 మంది, స్త్రీలు 29,075 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. జనరల్ ఓటర్లు 11,469 మంది, బీసీ ఓటర్లు 24,877 మంది, ఎస్సీ ఓటర్లు 18,112 మంది, ఎస్టీ ఓటర్లు 3035 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వివరించారు. పోలింగ్ బూత్ ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అప్రమత్తంగా ఉండండి .. జాగ్రత్తలు అవసరం

ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం నవంబర్ 4 ప్రభాతవార్త

మురుసు తుఫాను నేపథ్యంలో భీమవరంలోని యనమదురు డ్రెయిన్ లో నీటిమట్టం పెరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు అవసరమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. లాకుల నుండి అధిక మొత్తంలో 20 వేల క్యూసెక్కుల వర్షపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున యనమదురు డ్రెయిన్ లో నీటిమట్టం పెరుగుతుందని, పరిసర లోతట్టు ప్రాం తాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున భీమవరంలో 4 చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేస్తున్నామని అన్నారు. పునరావాస కేంద్రాలలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు.

విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆచరణాత్మక పట్టు సాధించాలి

విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి 'స్కిల్ స్పార్క్ 2.0' దోహదం

ఏపీ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్, డాక్టర్ కె.వి. కృష్ణారావు

తాడేపల్లిగూడెం,నవంబర్ 4 (ప్రభాత వార్త) విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆచరణాత్మక పట్టు సాధించాలని ఏపీ నిట్ డైరెక్టర్, ప్రొఫెసర్ కె.వి. కృష్ణారావు సూచించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'స్కిల్ స్పార్క్ 2.0' అనే అంశంపై బుధవారం ప్రయోగాత్మక సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ కె.వి.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గది బోధనకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాయోగిక అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంత